కథ

# సెంట్రల్ కేఫ్

భీమరాజు వెంకటరమణ

"అయిదు కాఫీ!" ఆర్డరిచ్చాడు ప్రభు. "అప్పుడే కాఫీ ఏమిటి? టిఫిన్ చెయ్యొద్దా?" అడిగాడు శ్రీనివాస్ అదేదో పొరపాటు జరిగిపోయినట్లు. మిగిలిన నలుగురం నవ్వుకున్నాం. శ్రీనివాస్ ఫలహారం ప్రియుడు. ఆ మాటంటే వాడికి కాస్త కోపం కూడా.

"సరే ఐదు దోశలు తీసుకురా" మళ్ళీ ఆర్డరిచ్చాడు ప్రభు. స్నేహితులతో కలిసి చాలాకాలం తరువాత ఒంగోలు సెంట్రల్ కేఫ్‌లో కూర్చోవడం నాకు చాలా ఆనందంగా ఉంది.

శ్రీనివాస్, ప్రభు అక్కడ ఆంధ్రకేసరి కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్లు. నరశింహాశాస్త్రి అడ్వకేట్, ప్రభాకర్ ఉమెన్స్ కాలేజీలో లైబ్రేరియన్. ఈ నలుగురు ఆ హోటల్‌కి పర్మినెంట్ కష్టమర్లు.

నా దృష్టి ఎదురుగా ఉన్న బిల్డింగుల మీద పడింది. అక్కడ నా చిన్నతనంలో మా నాన్నగారి ఆఫీసు ఉండేది. ఆయన హిందూ, ఆంధ్రపత్రిక విలేఖరి, ఏజెంట్. ప్రక్కనే మాకొక ప్రింటింగ్ ప్రెస్ కూడా ఉండేది. అవేమీ ఇప్పుడు అక్కడ లేవు. మా నాన్నగారు కూడా. నేనూ ఊరొదిలి వెళ్ళి మూడు దశాబ్దాలు దాటింది.

ప్రస్తుతం ఒంగోలులో ఎవరెవరు మిత్రులు ఉన్నారో కూడా ఖచ్చితంగా తెలియదు, ఆరోజు నాతో హోటల్లో కూర్చొని ఉన్న ఆ నలుగురైదుగురు తప్ప. నా పాత మిత్రులు కొందరు హైదరాబాదు లోనే ఉన్నారు, అప్పుడప్పుడు కలుస్తూనే ఉంటాం. మిగిలినవారిలో కొంతమంది దేశంలో వివిధ రాష్ట్రాలలో మరికొందరు విదేశాల్లో ఉన్నారు. అందర్నీ ఒక్కసారిగా కలవడం కుదరదు, బహుశా అసాధ్యమేమో కూడా! ఎవరైనా బయట ఉన్న మిత్రులు నాలాగా ఒంగోలు రావడం జరిగితే స్నేహితులెవరైనా ఉన్నారా అని వెతికేది సెంట్రల్ కేఫ్ దగ్గరే!

అంతలో ఆర్డరిచ్చిన దోశలు వచ్చేశాయి. అందరూ ఆస్వాదిస్తూ తింటున్నారు. నేను మాత్రం ఆ దోశ చూడగానే గతంలోకి అంటే ఐదోతరగతి రోజులకు వెళ్ళిపోయాను. సుందరమ్మ టీచర్ ఒకరోజు నన్ను ఆ హోటల్ నుండి దోశ తీసుకొచ్చి స్టాఫ్‌రూములో పెట్టమన్నది. అలా ఎవరో ఒకరిచేత తెప్పించుకొని స్టాఫ్‌రూములో తినడం ఆమె అలవాటు. ఆరోజు తేవడం నావంతైయింది.

అప్పుడు దోశ వెల ఇరవై పైసలు. ఆమిచ్చిన పావలా తీసుకొని హోటల్‌కి వెళ్ళి కౌంటర్ దగ్గర నిలబడ్డాను, పార్శిల్ చెబుదామని. అంతలో నా కళ్ళు ఎదురుగా కూర్చొని ఎంతో శ్రద్ధాశక్తులతో దోశ తింటున్న వ్యక్తిపై పడింది. నా మనసు వశం తప్పింది. వెళ్ళి కూర్చొని దోశ తెప్పించుకొని తినేసి నేరుగా ఇంటికి వెళ్ళిపోయాను.

మరుసటిరోజు భయంభయంగా స్కూలుకెళ్ళాను. ఆరోజు నా వీపుకు విమానం మోత తప్పదనుకున్నాను. కానీ టీచర్ విశాల హృదయంతో ఆ విషయం వదిలేసిందో లేక మరచిపోయిందో ఆ ప్రసక్తి రాలేదు. ఊపిరి పీల్చుకున్నాను.

"ఏమిత్రా తినకుండా ఏదో ఆలోచిస్తున్నావ్" అన్నాడు ప్రభాకర్. సుందరమ్మ టీచర్ దోశ వృత్తాంతం అందరికీ చెప్పాను. పెద్దగా నవ్వుకున్నాం.

కొద్దిసేపటికి క్రిష్ణారావు అనే మరొక స్నేహితుడు లోపలికివచ్చాడు. వాడు ప్రస్తుతం అక్కడే ఒక గవర్నమెంట్ ఆఫీస్‌లో ఉన్నతోద్యోగి. వాడి మాటల్లో కాస్త దుడుకుతనం ఉంటుంది. వాడికెప్పుడూ ఎవరిమీదనో కోపం! ఎందుకైనా మంచిదని అందరూ వాడితో కాస్త జాగ్రత్తగా ఉంటారు. కానీ నాకు మాత్రం వాడంటే ఇష్టం. వాడిది చిన్నపిల్లాడి మనస్తత్వం.

మా దగ్గరకు వస్తూనే "ఒరేయ్ రమణా!" అంటూ కౌగిలించుకున్నాడు. "ఎంత కాలమైందిరా నిన్ను చూసి? నువ్వొచ్చావని శాస్త్రి చెబుతే వచ్చా!" అంటూ ప్రక్కనున్న కుర్చీ మా టేబుల్ దగ్గరకు లాక్కుని కూర్చున్నాను.

కాఫీలు వచ్చాయి. ఒకరినొకరం చూసుకుంటూ తాగుతున్నాం. క్రిష్ణారావుని పరిశీలనగా చూసాను. ఉన్నదానికంటే ఎక్కువ వయసు మీద పడ్డవాడిలా ఉన్నాడు.

ఇదే సెంట్రల్ కేఫ్‌లో డిగ్రీ పాసైన తరువాత నిరుద్యోగాన్ని చవిచూస్తున్న రోజుల్లో వాడితో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. "నాకు ఈ జన్మలో ఉద్యోగం వస్తుందంటావా? ఇంకా ఆలస్యం అయితే ఇంట్లో ఇబ్బందులు మొదలౌతాయిరా!" అన్నాడు. అప్పుడు వాడి కళ్ళలో నీళ్ళు తిరగడం నాకు గుర్తు. "అదేమిత్రా అలా అధైర్యపడతావ్? బి.కాం. పాస్ అయ్యావు, టైపు, షార్టుహ్యాండ్ కూడా నేర్చుకున్నావు, నీకు రిజర్వేషన్ కూడా ఉంది! రాక చస్తుందిత్రా ఉద్యోగం?" అని ధైర్యం చెప్పాను.


చిత్రమేమిటంటే ఆ సమయంలో నాక్కూడా ఉద్యోగం లేదు. ఇంటర్ విద్యార్థులకి ట్యూషన్ చెబుతూ కాలం గడుపుతున్నాను. నేను వాడికి ధైర్యం చెప్పడం నాకే కాస్త విడ్డూరమనిపించింది.

సరిగ్గా రెండు నెలల తరువాత సెంట్రల్ కేఫ్‌లో ఒంటరిగా కూర్చొని కాఫీ త్రాగుతూ కనిపించాడు. "ఏరా! ఉద్యోగం వచ్చిందటగా? ప్రక్కన ఏదో ఊర్లోనట? నాకు చెప్పలేదే?" అడిగాను.

"ఏమి ఉద్యోగమో ఏమోరా! గాడిద చాకిరీ చేయిస్తున్నారు" అన్నాడు విసుగ్గా. నాకు కోపం వచ్చింది. "అప్పుడు ఉద్యోగం లేదని బాధపడ్డావ్! ఇప్పుడు పనెక్కువైయిందని గోల పెడుతున్నావ్! మనిషన్నాక తృప్తి అనేది ఉండాలా!" అన్నాను.

"ఏదో అన్నానులేరా నాయనా కోప్పడకు! ఏమైనా నీ నోటి వాక్యం ఫలించింది!" అన్నాడు నా చెయ్యి మీద చెయ్యి వేస్తూ.

గత ఆలోచనల నుండి బయటకొచ్చి, "ఏరా! ఇన్నేళ్ళకైనా నీ సమస్యలన్నీ తీరిపోయినట్లేనా?" అడిగాను. వాడు మళ్ళీ



ముఖం అదోలా పెట్టాడు. మళ్ళీ ఏదో చెప్పబోతున్నాడని మాకర్థమై యింది. "మా అబ్బాయి గురించేరా నా సమస్య! బి.కాం. పాస్ అయ్యాడు, ట్యాలీ, ఫోకస్ నేర్చుకున్నాడు. కానీ ఇంకా ఉద్యోగం రాలేదు అన్నాడు కాఫీ చప్పరిస్తూ. నాకు నవ్వొచ్చింది. "క్రిష్ణా! చిత్రం చూసావా? ఈ హోటల్‌లో నీ ఉద్యోగం గురించి ముప్పైమూడేళ్ళ క్రితం జరిగిన సంభాషణ మళ్ళీ ఇప్పుడు ఇదే సెంట్రల్ కేఫ్‌లో మీ అబ్బాయి గురించి జరుగుతోంది! అప్పుడు చెప్పిందే ఇప్పుడూ చెబుతున్నా! మీ అబ్బాయికీ మంచి ఉద్యోగం వస్తుంది! సరేనా?" అన్నాను. వెంటనే శాస్త్రి, శ్రీనివాస్ అ ందుకొని "మేం ట్రై చేస్తాంలేరా మీవాడికి ఉద్యోగం" అన్నారు. వాడి ముఖం కాస్త వికసించింది.

అంతలో సలీం, సూర్యకుమార్‌లు వచ్చి మరో రెండు కుర్చీలు లాక్కుని కూర్చున్నారు.

సూర్యకుమార్ నల్గొండ జిల్లా నకరికల్‌లో హిస్టరీ లెక్చరర్. వాడు వస్తూనే సెంట్రల్ కేఫ్ చరిత్ర చెప్పడం మొదలుపెట్టాడు. అసలు ఆ హోటల్ మొదటి ఓనరు రామన్ నాయర్ అని ఆయన క్రింద పని చేసిన వ్యక్తి గోపాలన్ అని, ప్రస్తుతం ఓనరు సీట్లో కూర్చున్నది అతని కుమారుడు అశోక్ అని చెప్పుకపోతున్నాడు. గోడకు దండవేసి తగి లించి ఉన్న గోపాలన్ ఫోటో చూసాం. దశాబ్దాలు గడిచినా తరం మారినా అదే వృత్తిని అంటిపెట్టుకొని ఉండటమేకాకుండా మా స్నేహితుల కు గత స్మృతులతోపాటు మేము కలవడానికి అవకాశం కలిపిస్తూ ఉన్నం దున అశోక్‌ని అందరం ఒకసారి అభిమానం నిండిన కళ్ళతో చూసాం.

ఆ తరువాత మా సంభాషణ ఆరోజు అంటే సెప్టెంబరు తొమ్మిదో తారీఖు మధ్యాహ్నం సలీం రచనలపై ఉమెన్స్ కాలేజీలో జరిగిన సాహిత్య సదస్సు వైపుకు మళ్ళింది. ఆ కార్యక్రమం కోసమే కాలేజీ వారు పిలువగా నేను సూర్యకుమార్ ఒంగోలు వెళ్ళింది.

ఇంటర్ చదివే రోజుల్లోనే సలీం కవితలు, కథలు వ్రాసేవాడు. అవి ఆ హోటల్‌లోనే ఓ ప్రక్క కూచుని తను చదవగా వినేవాళ్ళం. సలీం సాహిత్య రంగంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. ఇన్నేళ్ళ తరువాత సెంట్రల్ కేఫ్‌లో ఈసారి అతని రచనల గురించే కాక నా కథలు గురించి కూడా మాట్లాడుకోవడం విశేషం.

నా రైలుకు టైం అవుతు న్నది. కాలచక్రాన్ని అందరం కలిసి వెనక్కు నెట్టి చిన్నపిల్లలా రెండు గంట లు ఆనందంగా గడిపేశాం. మళ్ళీ కలుసుకునేది ఎప్పుడో! మిగిలిన స్నేహితులని ఈ సెంట్రల్‌కేఫ్ ఎప్పుడు కలుపుతుందో? కరచాలనం చేసుకొని విడిపోయాం.

అంతలో హడావిడిగ అక్కడికి ఒకతను వచ్చాడు. తన పేరు మూర్తి అని ఈనాడు పేపర్ విలేఖరినని పరిచయం చేసుకొని, సలీంను నన్నూ కాసేపు ఇంటర్వ్యూ చేసి మమ్మల్ని ఫొటో తీసుకొని వెళ్ళిపోయాడు.

కొద్దిసేపటికే హనుమంతరావనే మరో స్నేహితుడు వచ్చాడు. వాడు అక్కడే స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగి. హిందీ పాటలు బాగా పాడుతాడు. కాలేజీ రోజుల్లో వాణ్ని జూనియర్ కిషోర్‌కుమార్ అని పిలిచేవాళ్ళు. ఇదే హోటల్‌లో మూలగా ఉన్న టేబుల్ దగ్గర కూర్చొని వాడిచేత పాటలు పాడించుకునేవాళ్ళం. ఆ సాధన మూలంగానే వాడికి కాలేజీ పోటీల్లో ఉత్తమ గాయకుడుగా బహుమతి వచ్చింది.

ప్రస్తుతం వాడు కూర్చోవడానికి కుర్చీ ఏదీ ఖాళీగా లేదు. అప్పటికే ఆ టేబుల్ చుట్టూ ఎనిమిదిమంది కూర్చుని ఉన్నాం. శ్రీనివాస్ వాణ్ని తన ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. "వీడికొక స్పెషల్ టీ చెప్పండ్రా మంచి పాట ఒకటి పాడించుకోవాలి" అన్నాన్నేను. అది విని టీ తెచ్చిపెట్టిన సర్వర్, చిన్నపిల్లల్లా ప్రవర్తి స్తున్న మమ్మల్ని చూస్తూ నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఏ దో స్తీ హం నహీ ఛోడెంగే?" అని పెద్దగా పాడటం మొదలుపెట్టాడు హనుమంతరావు. వాడి గొంతు ఏమీ మారలేదు. మాతోపాటు చుట్టూ కూర్చున్న జనం కూడా చప్పట్లు కొట్టారు. ఇంటర్ చదివే రోజుల్లో ఇలాగే కోదండరామ్ పాటలు, ఆదం సాహెబ్ ఏకపాత్రాభినయం, కుంభారి సినిమా డైలాగులు అక్కడ కూర్చొని వినేవాళ్ళం. వాళ్ళు ప్రస్తుతం ఒంగోలులో లేరు. నాచేత పాడించావు కదా! సరదాగా సెంట్రల్ కేఫ్ మీద ఒక కవిత చెప్పరాదు?" అడిగాడు హనుమంతరావ్. నేను నోటికొచ్చినట్లు చెప్పేసాను!

"సెంట్రల్ కేఫ్ దోశ
సరదాగా రెండు తినేశా!
సాంబార్ ఇడ్లీ పై కన్నేశా
సావధానంగా జుర్రేశా
సీరియసగా పూరీకేసి చూశా
సందులేదని వదిలేశా
సర్వర్‌తో జ్యూస్ తెప్పించేశా
సింపుల్‌గా సప్పర్ ముగించేశా"


అందరితోపాటు హోటల్ ఓనర్ అశోక్ కూడా చప్పట్లు కొట్టాడు.

గంట ఎనిమిది దాటింది. అందరం లేచి హోటల్ బయటకు వచ్చాం. అక్కడే ఒక పెద్ద వేపచెట్టు ఉంది. దాన్ని చూడగానే హైదరాబాద్‌లో ఉంటున్న మరో స్నేహితుడు బసవరాజు గుర్తుకొచ్చాడు. వెంటనే సెల్ నుంచి వాడికి ఫోన్ చేసాను. "ఏరా! ఎక్కడున్నావ్ ఏం చేస్తున్నావ్?" అని అడిగాడు సావధానంగా.

"ఒంగోల్ సెంట్రల్ కేఫ్‌లో ఉన్నా! తొమ్మిదిమంది మన ఫ్రెండ్స్‌తో కలిసి!" అని వాళ్ళ పేర్లు చెప్పాను.

బసవరాజు రెచ్చిపోయాడు.

"ఒరేయ్! ఇది అన్యాయంరా! నాకు చెప్పకుండా అక్కడ గెట్ టుగెదర్ ఏర్పాటు చేస్తార్రా? నువ్వు హైదరాబాద్ రా! నీ పని చెబుతా" అని కేకలేస్తున్నాడు. నేనెందుకు ఒంగోలు వచ్చానో అను కోకుండా అందరం ఎలా కలిసామో అంతా వాడికి వివరంగా చెప్పి శాంతింప జేయటానికి కాస్త సమయం పట్టింది.



"నా వేపచెట్టు బావుందా?" అన్నాడు ఎంతో కావలసిన వాళ్ళ గురించి అడిగినట్లు.

"బాగలేకేమి? నీలాగా బలంగా లావుగా నీ జీతంలా ఎత్తుగా" అన్నాను.

"ఆ చెట్టుక్రిందేరా నేను రోజూ పేపర్ చదివింది! అక్కడ నిలుచుని ఉండగానేరా నా పీజీ రిజల్ట్స్ విన్నది!" అన్నాడు. వాడి గొంతులో ఆనందం ఆ క్షణంలో అక్కడ లేడన్న అసంతృప్తి నాకు తెలుస్తున్నది.

"సరే! నీ వేపచెట్టుకు నువ్వడిగావని చెప్పాలే! హైదరాబాద్‌లో కలుద్దాం" అని ఫోన్ పెట్టేశా. నా రైలుకు టైం అవుతు న్నది. కాలచక్రాన్ని అందరం కలిసి వెనక్కు నెట్టి చిన్నపిల్లలా రెండు గంట లు ఆనందంగా గడిపేశాం. మళ్ళీ కలుసుకునేది ఎప్పుడో! మిగిలిన స్నేహితులని ఈ సెంట్రల్‌కేఫ్ ఎప్పుడు కలుపుతుందో? కరచాలనం చేసుకొని విడిపోయాం. మరుసటి రోజు ఈనాడు పేపర్లో ప్రకాశం జిల్లా ఒంగోలు పేజీలో, "గుర్తుకొస్తున్నాయి" అన్న సందర్భోచితమైన క్యాప్షన్‌తో సలీంది, నాది ఫొటోలు వేసి అతని రచనలు గురించి, నా కథ లు గురించి వ్రాసారు. చిన్నతనం నుండి ఈరోజు వరకు ఆ హోటల్ లో మా స్నేహితుల్లో తనూ ఒకరిగా నిలిచి మా అందరి మధ్య మధురానుభూతులు కలుగజేస్తూనే ఉన్నది. అది సెంట్రల్ కేఫ్ మాత్రమే కాదు, మా మిత్రులందరికీ ఓ ఆత్మీయమైన కేరాఫ్. •